సాక్షి
కర్నూలు
మంగళవారం। 30। జనవరి। 2024



మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైలం: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించి. అనంతరం వెండిరథంపై ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలం: నిత్య కళారాధనలో భాగంగా సోమవారం హైదరాబాద్ రమ్యశ్రీ రాఘురమ్య కల్చరర్ ఆర్గనైజేషన్ వారు ప్రదర్శించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



.. జొన్నకు 'మద్దతు'

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుల వద్దకే వెళ్లి కందులను మార్కెట్ ధరతో, జొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నారు.

8లో▸

న్యూస్‌రీల్

1న కర్నూలులో మెగా జాబ్‌మేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

కర్నూలు(సెంట్రల్): నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి 1వ తేదీన మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన తెలిపారు. నైపుణ్య అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో 18 కంపెనీలు పాల్గొంటాయని, నైపుణ్యాలు ఉన్న 2,200 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటాయని పేర్కొన్నారు. మెగా జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో జేసీ నారపురెడ్డి మౌర్యతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో పాల్గొనాలనుకునే వారు skilluniverse.apssdc. inలో పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణాధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్‌మేళాకు సంబంధించి వివరాలను కో ఆర్డినేటర్ సృజన్ 8374231357ను సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఉపాధి కల్పన అధికారి దీప్తి పాల్గొన్నారు.

శ్రీమఠం హుండీ లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న సేవా భక్తులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం హుండీ లెక్కింపు సోమవారం ప్రారంభమైంది. జనవరి నెలకు సంబంధించి 33 రోజులకు కానులను లెక్కించారు. మొదటి రోజు రూ.3,83,70,000 ఆదాయం సమకూరినట్లు మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు వెల్లడించారు. రేపటితో హుండీ లెక్కింపు పూర్తవుతుందన్నారు.

2,186 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

- టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని 2,186 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశించారు. విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఫర్నిచర్, ర్యాంపులు, టాయిలెట్లు ఏర్పాటుచేయాలన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో ఉన్న పోలింగ్ స్టేషన్లలో కూడా సదుపాయాలు ఉండాలన్నారు. సోమవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. మంగళవారం నుంచి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పాల్గొన్నారు.

మరో 18 మంది ధ్రువపత్రాల పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): అనిమల్ హజ్బెండరీ అసిస్టెంట్(ఏహెచ్‌ఏ) పోస్టుల భర్తీలో భాగంగా మరో 18 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను సోమవారం పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో 252 ఏహెచ్‌ఏ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఇటీవల 233 పోస్టుల భర్తీకి సంబంధించి అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ప్రభుత్వం నోటిఫికేషన్‌లో ప్రకటించిన మార్గదర్శకాల మేరకు 19 పోస్టులకు అభ్యర్థులు లభించలేదు. దీంతో అర్హత మార్కులను తగ్గించి మరో 18 పోస్టులకు అభ్యర్థులను ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో రావాలని సమాచారం ఇచ్చారు. ఈ మేరకు 18 మంది రాగా అందరి ధ్రువపత్రాలను పరిశీలించారు. ఒక్క పోస్టుకు మాత్రమే అభ్యర్థి లభించలేదు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం, 5వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్ డబ్ల్యూఆర్ ఈఐఎస్ జిల్లా సమన్వయ అధికారిణి దీప్తి సోమవారం తెలిపారు. కోవెలకుంట్ల(బాలికలు), ఆళ్లగడ్డ రెగ్యులర్ (బాలికలు), ఆళ్లగడ్డ ఆర్‌పీఆర్‌పీ (బాలికలు),లక్ష్మాపురం (బాలికలు), డోన్ (బాలికలు), జూపాడుబంగ్లా (బాలురు), డోన్ (బాలురు) పాఠశాలలకు ఫిబ్రవరి 23వ తేదీలోగా వెబ్‌సైట్ https://apbragcet.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీన ఉంటుందన్నారు.

ప్రగతి పరిమళం!

రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లో కర్నూలు ఒకటి. అనంతపురం తర్వాత కరువు ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతం ఇది. వ్యవసాయం మినహా పారిశ్రామిక ప్రగతి లేదు.. వర్షం వస్తే పంటసాగు.. లేకపోతే మూటాముల్లె సర్దుకుని కర్ణాటక, కేరళ లాంటి ప్రాంతాలకు సుగ్గికి పోవడం ఆనవాయితీ. సీమ బిడ్డగా, ఇక్కడి పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి రాగానే కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించారు. సమస్య మూలాలు తెలుసుకొని, అభివృద్ధి కోసం అవసరమైన వనరులను అన్వేషించి అభివృద్ధికి బీజం వేశారు. ఆడా(ఆదోని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)ని ఏర్పాటుతో ప్రగతిని పరుగులు పెట్టించారు. వెనుకబడిన ఐదు నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొంది రోడ్డు నుంచి తాగునీటి దాకా.. బడి నుండి పరిశ్రమల దాకా సమగ్రాభివృద్ధికి శ్రీకారం చుట్టడం విశేషం. – సాక్షి ప్రతినిధి, కర్నూలు



వెల్దుర్తిలో నిర్మించిన 30పడకల ఆస్పత్రి

కనుమరుగువుతున్న దశాబ్దాల వెనుకబాటు

- 56 నెలలలో ప్రగతి పథంలో కర్నూలు
- వంతెనలు, రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ.2,860కోట్లు ఖర్చు
- రూ.475కోట్లతో ఆదోనిలో మెడికల్ కాలేజీ, 500 పడకల ఆస్పత్రి
- ఓర్వకల్‌లో మెగా ఇండస్ట్రియల్ హబ్
- రూ.60కోట్లతో జిల్లాలో 99 వ్యవసాయ గోదాములు నిర్మాణం

- కోడుమూరు పరిధిలో హంద్రీ–నదిపై నిర్మిస్తున్న ఈ వంతెన పనులు రూ.24కోట్లతో చేపట్టారు. పూర్తయితే క్రిష్ణగిరి–కోడుమూరు మధ్య 13 గ్రామాలకు రాకపోకలకు దూరం తగ్గనుంది.
- ఆదోనిలో రూ.475 కోట్లతో వైద్యకళాశాల నిర్మిస్తున్నారు. 500 పడకల ఆస్పత్రి కూడా రూపుదిద్దుకుంటోంది. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గంతో కోడుమూరు నియోజకవర్గంలో కొన్ని గ్రామాల ప్రజలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందనున్నాయి.
- ఎమ్మిగనూరు–కోడుమూరు దారిలో వర్కూరు వద్ద తుమ్మలవాగుతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. రూ.2కోట్లతో ఇక్కడ వంతెన నిర్మించారు. దీంతో భారీ వర్షాలు వచ్చినా రాకపోకలు ఇబ్బంది లేకుండా ప్రయాణం సాఫీగా సాగుతోంది.

రూ.88.50 కోట్లతో క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధి

జగన్నాథగట్టుపై 50 ఎకరాల్లో రూ.88.50కోట్లతో క్లస్టర్ యూనివర్సిటీ నిర్మిస్తున్నారు. ఇప్పటికే రూ.40కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. 50శాతంపైగా పనులు పూర్తయ్యాయి. తాజాగా రూ.70 కోట్లతో 15 ఎకరాల్లో అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ భవనాలు, కాలేజీ భవనాలతో పాటు, బాయ్స్, బాలికల వసతి గృహాలు, ఉద్యోగుల క్వార్టర్స్, క్రీడామైదానాలను నిర్మిస్తున్నారు. రూ.55కోట్ల రూసా నిధులతో పలు డిగ్రీ కాలేజీలను అభివృద్ధి చేశారు.

రూ.13.45 కోట్లతో ఫైనాన్స్ కాంప్లెక్స్

కర్నూలు బి.క్యాంపులో రూ.13.50 కోట్లతో డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్ ఆఫ్ ఫైనాన్స్ శాఖ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ట్రెజరీ, ఆడిట్, అకౌంట్స్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. 90 శాతం పనులు పూర్తయ్యాయి.

రూ.10కోట్లతో కలెక్టరేట్ ఆధునికీకరణ

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ను 1987లో నిర్మించారు. ఇందులో 32 ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. బిల్డింగ్ నిర్మించి 40 ఏళ్ల కావడంతో పెచ్చులూడి అసౌకర్యంగా మారింది. దీంతో ప్రభుత్వం రూ.10కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టింది.

రూ.60కోట్లతో 99 గోదాముల నిర్మాణం

కర్నూలు జిల్లాలో రూ.60కోట్లతో 99 వ్యవసాయ గోదాములు నిర్మిస్తున్నారు. వీటిలో 500 టన్నుల సామర్థ్యంతో 87, వెయ్యిటన్నులతో 12 నిర్మిస్తున్నారు. ఇప్పటికే 60 పూర్తయ్యాయి.



ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామానికి రూ.2 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు

- రాష్ట్రచరిత్రలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గానికి ఒక వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను నిర్మించారు. ఎరువులు, విత్తనాల నాణ్యతను పరీక్షించి రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించనున్నారు.
- కర్నూలు మార్కెట్‌యార్డులో రూ.8కోట్లతో జంబోషెడ్లు నిర్మిస్తున్నారు.

వందలకోట్లతో నీటిపారుదల అభివృద్ధి:

- గాజులదిన్నె ప్రాజెక్టుకు రూ.57.35కోట్లు ఖర్చు చేసి ఆనకట్టను ఒక మీటర్ ఎత్తుకు పెంచారు. దీంతో అదనంగా ఒక టీఎంసీ నీటిని నిల్వ చేస్తున్నారు. దీంతో 24 వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది. ఎమ్మిగనూరు, కోడుమూరు, డోన్ నియోజకవర్గాలకు తాగునీరు .. అత్యవసర పరిస్థితుల్లో కర్నూలుకు సాగునీరు అందనుంది.
- పత్తికొండ, డోన్, పాణ్యం నియోజకవర్గాల్లో 253.72కోట్లతో 77 చెరువులను నిర్మించారు. గతేడాది వీటిని ముఖ్యమంత్రి జాతికి అంకితం చేశారు. అలాగే వీటిలో 24 చెరువుల సామర్థ్యం పెంచేందుకు రూ.12.37కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నారు.
- గాజులదిన్నె ప్రాజెక్టుకు అదనంగా 3 టీఎంసీల నీటిని అందించేందుకు రూ.5.90కోట్లతో హంద్రీ–నీవా కాలువపై అదనపు స్లూయిజ్ ఏర్పాటు చేశారు.
- టీబీ డ్యాం బోర్డు పరిధిలోని ఎల్ఎల్‌సీ కాలువను రూ.450కోట్లతో 25 ప్యాకేజీలుగా ఆధునికీకరించారు.
- హగరి నది వరద ప్రవాహానికి ఎల్ఎల్‌సీ అక్విడక్ట్ ఫిల్టర్ కొట్టుకుపోయింది. దీంతో దాన్ని తిరిగి నిర్మించేందుకు రూ.50కోట్లు విడుదల చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేశారు.
- రూ.1985కోట్లతో వేదవతి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టగా, టీడీపీ నేతలు భూసేకరణపై కేసులు వేసి అడ్డుకున్నారు.



హంద్రీ–నీవా నీటితో నిండిన వెంకటాపురం తుమ్మల చెరువు

నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ఇలా..

ఆదోని:

- 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని రూ.10కోట్లతో ఆధునికీకరించారు.
- 50 పడకల మాతాశిశు రక్షణ కేంద్రాన్ని రూ.7కోట్లతో ఆధునికీకరించారు.
- విరూపాపురంలో రూ.7కోట్లతో పాలిటెక్నిక్ కాలేజీ నూతన భవనాన్ని నిర్మించారు.

మంత్రాలయం:

- రూ.10.42కోట్లతో బసాపురం ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నారు.
- భూగేని చెరువు వద్ద రూ.6కోట్లతో ఎస్ఎస్ ట్యాంకు నిర్మిస్తున్నారు.
- రూ.74.17కోట్లతో 6 ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు.
- రూ.28కోట్లతో 15 ఆర్అండ్‌బి రోడ్ల పూర్తి.
- రూ.6కోట్లతో కోసిగిలో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం.
- రూ.9.99కోట్లతో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు.

కోడుమూరు:

- లద్దగిరి ప్రభుత్వ ఆస్పత్రిని రూ.2కోట్లతో అభివృద్ధి. గతంలో 12 గంటలు మాత్రమే ఉన్న ఆస్పత్రి 24గంటలు సేవలు అందిస్తోంది. కాన్పులను కూడా అక్కడే చేస్తున్నారు.
- రూ.75కోట్లతో ఆర్అండ్‌బి రహదారుల నిర్మాణం.
- కోడుమూరు బస్టాండ్ రూ.40లక్షలు, గూడురు బస్టాండ్‌ను రూ.25లక్షలతో ఆధునికీకరించారు.
- తాగునీటి సమస్యను తీర్చేందుకు రూ.30కోట్లు మంజూరు.
- చిల్లబండ, బి.తాండ్రపాడులో అదనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం.

పత్తికొండ:

- రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు చేశారు.
- పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు.
- రూ.30కోట్లతో పత్తికొండలో రోడ్ల విస్తరణ చేశారు.
- రూ.7.50కోట్లుతో హోసూరు–మొలగవల్లి బీటీరోడ్డు నిర్మాణం.
- దూదేకొండ– కొత్తపల్లి మధ్య రూ.5.5కోట్లుతో బీటీరోడ్డు.
- వెల్దుర్తి ఆస్పత్రి రూ.5.77కోట్లతో 10 పడకల నుంచి 30పడకలకు అప్‌గ్రేడ్.
- వెల్దుర్తి–రామళ్లకోట మధ్య రూ.10 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మించారు.
- రూ.3.50కోట్లుతో క్రిష్ణగిరి రిజర్వాయర్ నుంచి పైపులైన్ ద్వారా వెల్దుర్తికి శాశ్వత మంచినీటి పరిష్కారం చేశారు.

ఎమ్మిగనూరు:

- ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రి రూ.22కోట్లతో ఆధునికీకరించారు. 50 పడకల నుంచి 100 పడకలకు అభివృద్ధి.

ఆలూరు:

- హత్తిబెళగల్‌కు రూ.2కోట్లతో బీటీరోడ్డు నిర్మాణం.
- ఆలూరు మండలం అరికెర తాండ గిరిజన గ్రామానికి రూ.22లక్షలతో సీసీ రోడ్డు.
- రూ.67కోట్లతో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం.
- రూ.5కోట్లతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను నాడు–నేడు ద్వారా అభివృద్ధి.



ఆదోనిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం



పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నూతన భవనం



కర్నూలులో రూపుదిద్దుకున్న క్లస్టర్ యూనివర్సిటీ భవనం

- జిల్లాలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.2,860.95కోట్లు ఖర్చు చేసింది. అలాగే రూ.277కోట్లతో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్‌హెల్త్ క్లీనిక్‌లను నిర్మించారు.
- తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.227.88 కోట్లు ఖర్చు చేశారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఇచ్చేందుకు రూ.198.72కోట్లు, జగనన్న కాలనీల్లో రూ.10.07కోట్లు, వైఎస్సార్ సులజ పథకం ద్వారా రూ.19.08కోట్లతో 507 పనులు చేపట్టారు.
- రూ.16.93 కోట్లతో పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు నూతన భవనాన్ని నిర్మించారు.
- చిప్పగిరి మండలం నగరడోణ వద్ద రూ.53.8కోట్లతో రిజర్వాయర్ నిర్మించారు. దీని ద్వారా 2,870 ఎకరాలకు సాగునీరు అందనుంది.
- కర్నూలు ఎయిర్‌పోర్టు పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.240కోట్లతో పూర్తి చేసింది. ప్రస్తుతం వైజాగ్, చెన్నై, బెంగళూరుకు సర్వీసులు.
- ఇక ప్రపంచంలోనే తొలి, అతి పెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ పవర్‌ప్లాంట్ కర్నూలు జిల్లాలోనే నిర్మితమవుతోంది. అదేవిధంగా జయరాజ్ ఇస్పాత్ స్టీల్‌ప్లాంట్ ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో నిర్మించారు. ఇదే ప్రాంతంలో సీగాచీ, ఆర్‌పీఎస్ తదితర పరిశ్రమలు స్థాపించనుండా. ప్లాస్టిక్, ఫార్మాకు సంబంధించి 23 కంపెనీలు భూమి కోసం దరఖాస్తు చేసుకోవడం విశేషం.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ఆర్డీఓ కె. మధుసూదన్ రావు



మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కర్నూలు సిటీ/(సెంట్రల్): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను డీఆర్‌ఓ కె.మధుసూదన్ రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లోని ల్యాబ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా సమయంలో విద్యుత్ సరఫరాలో లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కేంద్రం దగ్గర వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఉండాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం అధికారి గురవయ్య శెట్టి మాట్లాడుతూ.. వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి, జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు 11నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 20వ తేదీ వరకు కొనసాగనున్నాయన్నారు. వొకేషనల్‌కు 42, జనరల్‌కు 144 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వొకేషనల్‌లో 3,449, జనరల్‌లో 22,123 మంది ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా వృత్తివిద్యాధికారి కె.జమీర్ పాషా, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు వై.పరమేశ్వరరెడ్డి, జి.లాలెప్ప, సి.ప్రభు పాల్గొన్నారు.

పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ విద్యార్థులకు మూడో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో వర్సిటీతోపాటు నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ ఎన్.నరసింహులు పేర్కొన్నారు. మొదటి రోజు 570 మంది విద్యార్థులకు 546 మంది హాజరు కాగా 24 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆర్‌యూలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం వర్సిటీ హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని ఆదేశించారు. వీసీ వెంట వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చ ఉన్నారు.

కర్నూలు డీఐజీగా విజయరావు

కర్నూలు: కర్నూలు రేంజ్ డీఐజీగా కాకినాడ మూడో బెటాలియన్ కమాండెంట్ విజయరావును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడున్న సెంథిల్‌కుమార్‌ను ఆక్టోపస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే కర్నూలు సెబ్ అడిషనల్ ఎస్పీగా ఉన్న కృష్ణకాంత్‌పటేల్‌ను కాకినాడ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. అయితే, కర్నూలు ఏఎస్పీగా ఎవరినీ నియమించలేదు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం–స్పందనలో వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన ప్రతి అర్జీకి సరైన ఎండార్స్‌మెంట్ ఇస్తే పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అందులో పనిచేసే అధికారులు ఉద్యోగుల వివరాలు అన్ని శాఖల డీడీఓలు అందించాలని కోరారు. స్పందన కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బావుటా

రుణపడి ఉంటాం



నేను కొన్నేళ్ల నుంచి టైలర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. గతంలో మాకు ఎలాంటి పథకాలు ఉండేవి కాదు. వృత్తి నమ్ముకున్న మాలాంటి వారికి జీవనం గడవడం కష్టంగా ఉండేది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక మా జీవితాల్లో మార్పు వచ్చింది. మా కోసం జగనన్న చేదోడు పథకం పెట్టి ఏటా రూ.10 వేలు చొప్పున ఇస్తున్నారు. ఈ డబ్బుతో కొత్త మిషన్ కొనుగోలు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నా. పేదల జీవితాలను మారుస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి రుణపడి ఉంటాం.

– అబ్దుల్ రజాక్, గడివేముల

ఎంతో మేలు చేశారు



మాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మా ఊర్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. గతంలో పిల్లల చదువులు భారమయ్యేవి. జగనన్న వచ్చాక అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15వేలు సాయం అందుతోంది. జగనన్న విద్యా కానుక కింద చదువులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం ఇతరత్రా అన్నీ ఉచితంగా ఇస్తున్నారు. మా ఊరి బడి రూపురేఖలు కూడా మారుతున్నాయి. లక్షలు ఖర్చుపెట్టి కొత్తగా అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. జగనన్న పిల్లల చదువులకు భరోసా కల్పించారు. నాకు చేదోడు పథకం కింద రూ.20వేలు వచ్చాయి. మాలాంటి పేదలకు పథకాల ద్వారా జగనన్న ఎంతో మేలు చేశారు.

– వరలక్ష్మి, రాతన, తుగ్గలి మండలం

సేఫ్ కస్టడీ ఆర్టికల్స్ అప్పగింత

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీలోని స్ట్రాంగ్ రూములో మూడేళ్ల పైబడి ఉన్న సేఫ్ కస్టడీ ఆర్టికల్స్‌ను సంబంధిత శాఖల అధికారులకు అప్పగించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో ట్రెజరీలోని స్ట్రాంగ్ రూమును ఖాళీ చేయించే దిశగా ఆర్థిక శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 22 సేఫ్ కస్టడీ ఆర్టికల్స్‌ను సంబంధిత శాఖల అధికారులు తీసుకెళ్లారు.

క్లుప్తంగా

కుంగిన బండ్‌ను పరిశీలించిన సీఈ



కుంగిన ప్రదేశాన్ని పరిశీలించి ఇంజనీర్లతో మాట్లాడుతున్న సీఈ కబీర్‌బాషా

పాణ్యం: గోరుకల్లు జలాశయం ఓటీ రెగ్యులేటర్ వద్ద కుంగిన బండ్‌ను సోమవారం జలవనరుల శాఖ సీఈ కబీర్‌బాషా పరిశీలించారు. బండ్ కుంగడానికి గల కారణాలను ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఇంకోసారి బండ్ కుంగకుండా తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. ప్రస్తుతం పనులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ఇదిలా ఉండగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఈ విషయంపై ఫోన్‌లో జలవనరుల శాఖ మంత్రి, ఈఎన్‌సీతో మాట్లాడారు. మరమ్మతులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఈ వెంట ఈఈ సుభకుమార్, డీఈఈ అశ్వర్థనారాయణ, ఏఈఈలు ఉన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభం

- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యుత్ అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై సోమవారం నుంచి ప్రజాభిప్రాయ సేకరణకు విద్యుత్ అధికారులు శ్రీకారం చుట్టారు. విశాఖపట్నం నుంచి విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు సంతోష్ రావు, పృధ్వీతేజ్ తాము ప్రతిపాదించిన వాటి వివరాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. మొదటి రోజు అభిప్రాయాలు వెల్లడించేందుకు, విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన వాటిపై అభ్యంతరాలు చెప్పేందుకు పారిశ్రామికవేత్తలు, ఇతరులు ఎవరూ రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. మంగళ, బుధవారాల్లో కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. సోమవారం కర్నూలు, నంద్యాల, ఆదోని, డోన్ కేంద్రాలుగా వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. కర్నూలులో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఈ ఉమాపతి, కర్నూలు టౌన్ డీఈ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీ క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ నెల 30న నగరంలోని సీ.క్యాంపు రైతుబజారును ఒక్కరోజు బంద్ చేస్తున్నట్లుగా ఎస్టేటు అధికారి హరిష్ కుమార్, హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. వినియోగదారులు, రైతుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని రైతుబజారును శానిటైజ్ చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందని వారు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కందికి 'మార్కెట్ ధర'.. జొన్నకు 'మద్దతు'

అన్నదాతకు అండగా ప్రభుత్వం

- డీసీఎంఎస్ ద్వారా కందుల కొనుగోలు
- గోనెసంచులు, లేబర్, రవాణా చార్జీల చెల్లింపు
- ఇప్పటికే 9వేల క్వింటాళ్లు కొనుగోలు చేసిన డీసీఎంఎస్
- రబీ జొన్నలు మద్దతు ధరతో కొనుగోలుకు రంగం సిద్ధం



రైతుల నుంచి కందులను కొనుగోలు చేస్తున్న డీసీఎంఎస్ ప్రతినిధి

కర్నూలు(అగ్రికల్చర్): 2023-24లో పండించిన కందులు, జొన్నల కొనుగోలుకు ప్రభుత్వం రైతుల వద్దకే వివిధ సంస్థలను పంపుతోంది. బహిరంగ మార్కెట్‌లో కందుల ధర ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ధరకే ప్రభుత్వం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేస్తోంది. అదేవిధంగా మార్కెట్‌లో జొన్నల ధర తక్కువగా ఉండటంతో కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయడం విశేషం. రైతుల నుంచి కొనుగోలు చేసిన కందులు, జొన్నలను తిరిగి ప్రభుత్వం ప్రజాపంపిణీ ద్వారా వినియోగదారులకు సరఫరా చేస్తుంది. 2023-24లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం వల్ల సాగు విస్తీర్ణం తగ్గింది. ఇదే సమయంలో దిగుబడి కూడా తగ్గింది. అయితే కందులకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో ధర ఆశాజనకంగా ఉంది. నాణ్యతను బట్టి క్వింటా రూ.9600 నుంచి రూ.10వేలకు పైగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ప్రజాపంపిణీ ద్వారా కందిపప్పు సరఫరా చేయడానికి ప్రభుత్వం కందుల కొనుగోలుకు పౌరసరఫరాల సంస్థను రంగంలోకి దింపింది. ఈ సంస్థ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా కందులు, జొన్నలను కొనుగోలు చేస్తోంది.

ఏడు రోజుల్లోనే రైతుల ఖాతాకు నగదు జమ

కందులను నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు అధికారులు కొద్ది రోజులుగా రైతుల వద్దకే వెళ్తున్నారు. మద్దతు ధరతో కందులు కొనుగోలు చేసినప్పుడు రైతుల బ్యాంకు ఖాతాలకు 21 రోజుల పని దినాల్లో నగదు జమ చేయడం పరిపాటి. ఇప్పుడు 7 పని దినాల్లోనే రైతుల ఖాతాకు నగదు జమ చేసేందుకు పౌరసరఫరాల సంస్థ రంగం సిద్ధం చేసుకుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్, డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ అధికారులు కందుల కోసం రైతుల దగ్గరకు వెళ్తున్నారు. ఏ రోజు ధరను అదేరోజు సీఎం యాప్‌లో ఉంచుతారు. సీఎం యాప్‌లో వచ్చే ధర ప్రకారం కందులు కొనుగోలు చేస్తారు. పౌరసరఫరాల సంస్థ మార్కెట్ ధర ప్రకారం రూ.9,445తో కందులు కొనుగోలు చేస్తారు. ఇందులో లేబర్, గన్నీ బ్యాగ్, ట్రాన్స్‌పోర్టు చార్జీలు కూడా ఉంటాయి.

డీసీఎంఎస్ ద్వారా 9వేల క్వింటాళ్ల కందుల కొనుగోలు

కొద్ది రోజుల క్రితమే జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ 9వేల క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసింది. మొదట్లో బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర మేరకు నాఫెడ్ ధర ఉండటంతో రైతులు డీసీఎంఎస్‌కు కందులు విక్రయించారు. తాజాగా కేవలం పౌరసరఫరాల సంస్థకే డీసీఎంఎస్ కందులు కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆ మేరకు అధికారులు వివిధ మండలాల్లో రైతులను కలిసి మార్కెట్ ధరకే కందులను కొనుగోలు చేస్తామని పేర్కొంటున్నారు.

మద్దతు ధరతో జొన్నల కొనుగోలు

జొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థను రంగంలోకి దింపింది. జొన్నలకు కనీస మద్దతు ధర రూ.3180. మద్దతు ధర మహేంద్ర రకాలకు చెందిన తినే జొన్నలకే వర్తిస్తుంది. మార్కెట్‌లో ప్రస్తుతం జొన్నల ధర రూ.2600 మాత్రమే. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంది. జొన్న సాగు చేసినట్లు ఈ-క్రాప్‌లో నమోదై.. ఈ-కేవైసీ చేయించుకున్న రైతుల నుంచి జొన్నలు మద్దతు ధరతో కొనుగోలు చేస్తారు. రైతులు ముందుగా ఆర్‌బీకేల్లో సంప్రదించి సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేయించుకోవాల్సి ఉంది.

చెరకు పంట దగ్ధం



దగ్ధమవుతున్న చెరకు పంట

జూపాడుబంగ్లా: పొలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగల వల్ల షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటలకు చెరకు పంట దగ్ధమైంది. ఈ ప్రమాదం తంగడంచ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగిరెడ్డి, సుభద్రమ్మ, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి తలా రెండు ఎకరాల చొప్పున పది ఎకరాల్లో చెరకు పంట సాగుచేశారు. ఆదివారం రాత్రి పంటపొలంపై కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో పంటకు మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న రైతులు మంటలను ఆర్పేందుకు యత్నించారు. సాధ్యం కాకపోవటంతో ఆత్మకూరు ఫైర్‌స్టేషన్ అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు సంఘటనా ప్రాంతానికి చేరుకొని చెరకు పంటకు వ్యాపించిన మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు 70శాతం మేర పంట దగ్ధం కావడంతో రైతులకు రూ.15 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమర్థంగా విధులు నిర్వహించాలి



ఏఆర్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా ఆర్ముడు రిజర్వ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆర్ముడు రిజర్వ్ సిబ్బంది విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా శారీరక, మానసిక ధృఢత్వం కూడా అవసరమన్నారు. శిక్షణ సమయంలో తీసుకున్న తర్ఫీదు అంశాలు గుర్తు చేసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ కేటాంచిన విధులను సకాలంలో నిర్వర్తించాలన్నారు. అనంతరం ఆయన ఆర్‌ఐ స్టోర్స్, ఆయుధాగారం, సెక్యూరిటీ విభాగం, ట్రాన్స్‌పోర్ట్ విభాగం, హోంగార్డ్ కార్యాలయాలు పరిశీలించి రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఎస్పీ వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ రంగముని, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, శ్రీనివాసులు, మంజునాథ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్టువ్యాధి అవగాహన పక్షోత్సవాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఆర్‌వో పుల్లయ్య, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ తదితరులు

నంద్యాల టౌన్: జిల్లాలో మంగళవారం నుంచి 15 రోజుల పాటు కుష్టువ్యాధి అవగాహన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ పరిధిలోని సెంటినరీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య మాట్లాడుతూ మహాత్మా గాంధీ కుష్టు వ్యాధిగ్రస్తులకు చేసిన సేవలకు గుర్తుగా ఆయన వర్ధంతి జనవరి 30వ తేదీని ప్రభుత్వం యాంటీ లెప్రసీడేగా నిర్వహిస్తుందన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టుతామన్నారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎం. శారదా బాయి, డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, సూపరింటెండెంట్ ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలును సందర్శించిన న్యాయమూర్తి

కర్నూలు (లీగల్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు సోమవారం పంచలింగాల గ్రామంలోని జిల్లా జైలును సందర్శించారు. అక్కడ ఉన్న ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. ఉన్నత న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ వ్యవస్థ ద్వారా అందిస్తున్న మెరుగైన ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాస రావు, జైలు పర్యవేక్షణ అధికారులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లు రూ.1.60 లక్షలు కాజేశారు!

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

కర్నూలు: ట్రేడ్స్ ఎక్స్ కంపెనీ పేరుతో సైబర్ నేరగాళ్లు తన వాట్సాప్‌కు లింక్ పంపి ఫోన్‌లో ఉన్న డేటా సేకరించి బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.60 లక్షలు తీసుకుని మోసగించారని, చర్యలు తీసుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్‌కు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన రిజ్వాన్ బాషా ఫిర్యాదు చేశారు. కర్నూలులోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి మొత్తం 66 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందనలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- కన్సల్టెన్సీ పేరుతో కొంతమంది వ్యక్తులు ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేశారని , విచారణ జరిపి డబ్బులు వాపసు ఇప్పించాల్సిందిగా కర్నూలుకు చెందిన విష్ణు కోరారు.
- ఆస్తి కోసం కుమారుడు తనను చంపుతానని బెదిరిస్తున్నాడని, రక్షణ కల్పించాల్సిందిగా హొళగుంద మండలం హెబ్బటం గ్రామానికి చెందిన ఈశ్వరప్ప వినతి పత్రం అందించారు.
- భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి సర్వేయర్‌ను కొలతలు వేయనివ్వకుండా శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ అనే వ్యక్తులు అడ్డుపడుతున్నారని ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన వెంకటస్వామి ఫిర్యాదు చేశారు.
- పొలం కౌలుకు తీసుకున్న వ్యక్తి నకిలీ అగ్రిమెంట్లు సృష్టించి మోసం చేశాడని, తన పొలానికి కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ ఆరు ఎకరాల జొన్న పంటను దున్ని నాశనం చేసిన నగరూరు గ్రామానికి చెందిన రంగన్న, ప్రభాకర్‌లపై చర్యలు తీసుకోవాలని ఆస్పరి మండలం నగరూరు గ్రామానికి చెందిన హుసేనప్ప ఫిర్యాదు చేశారు.
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వైఎస్సార్ జిల్లాకు చెందిన మంజునాథ్ రెడ్డి డబ్బులు తీసుకుని నకిలీ నియామక పత్రాలు పంపి మోసం చేశాడని నాగలాపురం గ్రామానికి చెందిన ఉపేంద్ర, కర్నూలుకు చెందిన విష్ణుచరణ్‌లు ఫిర్యాదు చేశారు.

ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్‌గా విశ్వేశ్వర రెడ్డి

కర్నూలు (టౌన్): నగర పాలక ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్‌గా విశ్వేశ్వర రెడ్డిని కమిషనర్ భార్గవ్‌తేజ నియమించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల క్రితం ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ శివారెడ్డి వినుకొండ మున్సిపాల్టీకి కమిషనర్‌గా బదిలీపై వెళ్లడంతో నగరపాలక ఆరోగ్యశాఖాధికారిగా పనిచేస్తున్న ఆయనను నియమించారు.

నగరపాలక కార్యదర్శిగా నాగరాజు

నగర పాలక కార్యదర్శిగా నాగరాజు సోమవారం తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ మాలిక్ రాయదుర్గం మున్సిపాల్టీకి కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నగరపాలక శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న నాగరాజును నగరపాలక కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది.

మల్లన్నకు బంగారు, వెండి పుష్పాల సమర్పణ




స్వామివార్లకు సమర్పించిన బంగారు వెండి పుష్పాలు.



బంగారు, వెండి పుష్పాలను సమర్పించిన దాతలు మురళీ తదితరులు

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో కొలువుదీరిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ప్రత్యేక పూజలలో వినియోగించుకోవడానికి వీలుగా హైదరాబాద్‌కు చెందిన మురళి తన కుటుంబ సభ్యులతో కలిసి బంగారు, వెండి పుష్పాలను సోమవారం సమర్పించారు. ఆలయ ప్రాంగణమంలోని అమ్మవారి ఆశీర్వచన మండపంలో వసతివిభాగం సహాయ కార్యనిర్వహణాధికారి ఐఎన్‌వీ మోహన్, పర్యవేక్షకులు స్వాములుకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ 82 గ్రాములతో 8 తామరపువ్వ డిజైన్‌తో ఉన్న బంగారు పుష్పాలు, 40 గ్రాములతో 110 వెండి చిన్న పుష్పాలను రూ. 5.45లక్షలతో తయారు చేయించినట్లు తెలిపారు. అనంతరం దాతలకు దేవస్థానం అధికారులు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డుప్రసాదాలు అందజేసి సత్కరించారు.



కమలాకారంలో దాతలు డిజైన్‌తో చేయించిన బంగారు పుష్పాలు

రేషన్.. లేదు పరేషాన్!



నాడు : రేషన్ కోసం క్యూ నిల్చున్న జనాలు

- ఇంటి వద్దకే రేషన్ పంపిణీ
- తొలగిన ఇబ్బందులు

మద్దికెర : రేషన్ కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పని లేదు. కిలోమీటర్ల దూరం నడవాల్సిన అవసరం అంతకంటే లేదు. ఇంటి వద్దకే రేషన్ పంపిణీ వస్తోంది. గతంలో బియ్యం తీసుకోవాలంటే రోజుల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. సరుకుల కోసం వెళ్తే డీలర్ అందుబాటులో ఉండేవారు కాదు. రేషన్ కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. తూకంలో మోసాలు సరేసరి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికే రేషన్ సరుకులు అందించడానికి ఎండీయూ ఆపరేటర్లను నియమించారు. వారికి వాహనాలు అందించారు. ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి. తూకాల్లో మోసానికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా రేషన్ పంపిణీ చేస్తున్నారు. జీపీఎస్, రైస్ కార్డు మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టి ప్రజలకు సరుకులు అందిస్తున్నారు. జీపీఎస్ మ్యాపింగ్‌తో లబ్ధిదారులు ఏరేషన్ షాపు పరిధిలో ఉన్నా, నివసించే ప్రాంతంలోని చౌకదుకాణం నుంచే పోర్టబులిటీ ద్వారా రేషన్ తీసుకోవచ్చు. వేరే ప్రాంతానికి వెళితే ఆప్రాంత వలంటీర్ కు సమాచారం ఇచ్చి జీపీఎస్ మ్యాపింగ్ చేయించుకుంటే చాలు. గడప దాటకుండానే నెలారంభంలో పదిరోజులు పాటు సరుకులు అందించనున్నారు. ఏరోజుకు ఏవీధిలో ఎవరి ఇళ్ల వద్దకు ఎన్ని గంటలకు రేషన్ డెలివరీ వాహనం వస్తుందో ముందుస్తు సమాచారం ఇస్తున్నారు. కుటుంబంలో ఒకరు ఉంటే చాలు సరుకులు అందజేస్తారు.

ఇదీ మార్పు



నేడు: ఇంటి వద్దే నిత్యావసర సరుకుల పంపిణీ

నంద్యాల జిల్లా	కర్నూలు జిల్లా..
రేషన్ కార్డులు : 5.49 లక్షలు	రేషన్ కార్డులు: 6.71 లక్షలు
ఎండీయూ వాహనాలు: 351	ఎండీయూ వాహనాలు: 409

నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పేదలకు నాణ్యమైన బియ్యాన్ని అదిస్తున్నాం. సకాలంలో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తాం. సిద్ధం చేసిన వాహనాల్లో సరుకులు చేరవేసేందుకు చర్యలు చేపడతున్నాం.
– నాగభూషణం, తహసీల్దార్, మద్దికెర

ఇంటి వద్దే సరుకులు అందిస్తున్నారు



గతంలో స్టోర్‌కు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ఇంటి వద్దకే వ్యానులో వచ్చి సరుకులు ఇస్తున్నారు. మాలాంటి వృద్ధులకు ఇలాంటి సౌకర్యం కల్పించడం చాలా సంతోషంగా ఉంది.
– లక్ష్మిదేవి, మద్దికెర

వాహనం ఏర్పాటు చేయడం సంతోషం



మేము రాంనగర్‌లో ఉంటున్నాం. రేషన్ షాపు కిలోమీటరు దూరంలో ఉంటుంది. ప్రతినెలా రేషన్ కోసం ఇబ్బందులు పడేవాళ్లం. ప్రభుత్వం వాహనం ఏర్పాటు చేసిన తరువాత ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేస్తున్నారు. మాకు చాలా సంతోషంగా ఉంది. –రాజేష్, మద్దికెర

సకాలంలో అందజేస్తున్నాం



అధికారుల ఆదేశాల మేరకు సకాలంలో ప్రజలకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్నాం. అంతేగాక కాలనీలకు ఎప్పుడు వచ్చేది సూచనలు ఇస్తాం. దీంతో వాహనం వచ్చిందని లబ్ధిదారులు వచ్చి సరుకులు తీసుకెళ్తారు.
–షేక్షావలి, ఎండీయూ ఆపరేటర్, మద్దికెర